క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్‌: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించాలని తెలిపారు. పూజలో దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'సినీ నటి జమున మరణం బాధాకరం'



విశాఖ విచ్చేసిన జమునతో పాలూరి శేషుమాంబ (ఫైల్‌)

డాబాగార్డెన్స్‌: సినీనటి జమున అకాల మరణం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని కాంగ్రెస్‌ పార్టీ నాయకురాలు, వృత్తి కళాకారుల సంఘం మాజీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ పాలూరి శేషుమాంబ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఆర్యవైశ్య కులానికి చెందడం వైశ్యులకే గర్వకారణమన్నారు. జమునకు విశాఖతో విడదీయరాని సంబంధం ఉందని, ఎన్నో కార్యక్రమాలకు తాను ఆమెను విశాఖపట్నం తీసుకువచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. నాటి ప్రధాని వీపీ సింగ్‌ హయాంలో జమునకు, తనకు ఒకేసారి మహిళా శిరోమణి అవార్డులు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. విశాఖపట్నం వాసిగా, ఆర్య వైశ్య మహిళగా జమున మృతి మనస్తాపానికి గురి చేసిందని శేషుమాంబ ఆవేదన వ్యక్త పరిచారు.

కేజీహెచ్‌ కోపరేటివ్‌ సొసైటీ సేవలు ప్రశంసనీయం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్‌ అశోక్‌కుమార్‌ తదితరులు

మహారాణిపేట : కేజీహెచ్‌ క్లాస్‌–3, క్లాస్‌–4 ఎంప్లాయిస్‌ కోపరేటివ్‌ థ్రిఫ్ట్‌ అండ్‌ క్రెడిట్‌ సొసైటీ లిమిటెడ్‌ సభ్యులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పి.అశోక్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం కేజీహెచ్‌ ఆవరణలో సొసైటీ కార్యవర్గం ప్రచురించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు మాట్లాడుతూ సొసైటీలో 135 మంది సభ్యులు ఉన్నారన్నారు. సభ్యుల అవసరాలు తీర్చడంలో సొసైటీ మెరుగ్గా పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బవురు శెట్టి వీరుబాబు, ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాస్‌, కోశాధికారి ఎం.శ్రీనివాస్‌, డైరెక్టర్లు ఎస్‌.శ్రీనివాసరావు, ఎంవీవీఎస్‌ రవికుమార్‌, ఎ.వెంకటరావు, వై.దుర్గమ్మ, కె.అశోక్‌కుమార్‌, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను విడనాడండి

- జీవీఎంసీ చీఫ్‌ మెడికల్‌ ఆఫీసర్‌ కేఎల్‌ఎన్‌ శాస్త్రి
- వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన



పూర్ణామార్కెట్‌ వద్ద గుడ్డసంచులతో అవగాహన కల్పిస్తున్న సీఎంహెచ్‌వో కేఎల్‌ఎన్‌ శాస్త్రి

జగదాంబ: మానవవాళికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిద్దామని జీవీఎంసీ చీఫ్‌ మెడికల్‌ ఆఫీసర్‌ కేఎల్‌ఎన్‌ శాస్త్రి అన్నారు. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా శుక్రవారం పూర్ణామార్కెట్‌లో వ్యాపారులతో కలిసి ప్లాస్టిక్‌ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో మానవవాళికే కాకుండా మూగజీవాలకు కూడా ప్రమాదం అన్నారు. కవర్లతో కూడుకున్న వ్యర్థాలను తిని.. అవి అరగక జంతువులు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కవర్ల అమ్మకాలు, కొనుగోళ్లను పూర్తిగా నిషేధించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జీవీఎంసీ కమిషనర్‌ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను నిషేధిస్తే.. అనంతరం వినిగదారులు కూడా ప్లాస్టిక్‌ వాడకం మానేస్తారని అన్నారు. అనంతరం పూర్ణామార్కెట్‌లో దుకాణాలను పరిశీలించారు. వినియోగదారులకు గుడ్డసంచులు ఇచ్చారు. ఇంటి నుంచి సంచులు తీసుకురావాలని తెలిపారు. పూర్ణామార్కెట్‌ నుంచి బౌడారా రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి–పొడి, ప్రమాదకర చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్‌–4 కమిషనర్‌ శివప్రసాద్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పావులూరి హనుమంతరావు

డాబాగార్డెన్స్‌: రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల జనాభా గల విశ్వబ్రాహ్మణులకు ఒక ఎంపీ, 2 ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్‌ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, బీసీ సంక్షేమ సంఘం చైర్మన్‌ కేశినేని శంకరరావు డిమాండ్‌ చేశారు. వీజేఎఫ్‌ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర బీసీ జనాభాలో 7వ అతి పెద్ద సామాజిక వర్గంగా విశ్వబ్రాహ్మణులు ఉన్నప్పటికీ ప్రభుత్వ పరంగా నిరాదరణకు గురి కాబడ్డ వర్గంగా ఉన్నామన్నారు. మంగళసూత్రం తయారు హక్కుదారులుగా విశ్వబ్రాహ్మణ, స్వర్ణకారులకు వీలు కలిస్తూ అసెంబ్లీలో చట్టం చేయాలని, జీవో 272 రద్దు పరచాలని లేదా స్వర్ణకారుకు అనుకూలంగా సవరణ చేయాలని, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్‌ స్వయంప్రతిపత్తి గల ఇండస్ట్రీస్‌ డిపార్టుమెంట్‌ అనుసంధానంగా కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలన్నారు. బంగారు దుకాణాలు/జ్యూయలరీ మార్ట్‌లపై విధించిన సొమ్మును విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ ద్వారా విశ్వబ్రాహ్మణులకు లబ్ధి చేకూర్చాలని, రజకులు, నాయీబ్రాహ్మణులకు ఇస్తున్న రూ.10 వేలు విశ్వబ్రాహ్మణ పంచవృత్తిదారులకు వర్తింపజేయాలని, తిరుమలలో వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, వసతి గృహం నిర్మాణం చేసి టీటీడీ ద్వారా ఎకరా భూమి విశ్వబ్రాహ్మణ సంఘానికి కేటాయించాలని కోరారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, జయంతి పురస్కరించుకుని టీటీడీ నుంచి పట్టువస్త్రాలు ప్రభుత్వ పక్షాన ఏర్పాటు చేయాలన్నారు. 45 ఏళ్లు నిండిన పంచవృత్తుల వారికి పెన్షన్‌ సదుపాయం కల్పించాలని, ప్రతి నెలా రూ.3 వేలు జీవనభృతిగా మంజూరు చేయాలని, విశ్వబ్రాహ్మణ చేతివృత్తిదారులకు విశ్వకర్మీయ కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించాలని కోరారు. రూ.5 లక్షల ఆరోగ్య బీమా కార్డులు ప్రభుత్వమే ఉచితంగా అందివ్వాలన్నారు. సమావేశంలో అన్నవరపు నాగమల్లేశ్వరరావు, దువ్వూరి నరసింహాచారి, లక్కోజు సుజాత, శివకోట శ్రీనివాసరావు, కోలాంటి రాజు, మందా రమేష్‌, పక్కి కొండబాబు, వెంకటరమణ, సింహాద్రి ధనుంజయ, బంగారు సురేష్‌, గుర్రం ద్వార శ్రీను, గుత్తికొండ గంగాధర్‌, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సమర యాత్ర పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార : కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ 2014లో పార్లమెంట్‌ సాక్షిగా ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన హామీలు అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందని ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమరయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.ఫణీంద్రకుమార్‌ మాట్లాడుతూ జనవరి 25 నుంచి ఫిబ్రవరి 4 వరకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు సమరయాత్ర చేపట్టామని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, పోలవరం ప్రాజెక్టుకి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఫిబ్రవరి 2వ తేదీన సమర యాత్ర విశాఖకు చేరుకుంటుందని తెలిపారు. నగరంలో భారీ ఎత్తున సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు, యువకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, ఎం.రాంబాబు, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న వారిని అరెస్టు చేయాలి



బీఎస్‌ఎన్‌ఎల్‌ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

డాబాగార్డెన్స్‌: ఆలిండియా వర్కింగ్‌ ఉమెన్‌ కో ఆర్డినేషన్‌ కమిటీ పిలుపు మేరకు డాబాగార్డెన్స్‌లో గల బీఎస్‌ఎన్‌ఎల్‌ జనరల్‌ మేనేజర్‌ టెలికాం కార్యాలయం వద్ద బీఎస్‌ఎన్‌ఎల్‌ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న వారిని అరెస్టు చేయాలని ఢిల్లీ జంతర్‌మంతర్‌ వద్ద ధర్నా చేస్తున్న మహిళలకు మద్దతుగా బీఎస్‌ఎన్‌ఎల్‌ వర్కింగ్‌ ఉమెన్‌ కో ఆర్డినేషన్‌ కమిటీ విశాఖ జిల్లా యూనియన్‌ తరఫున నిరసన చేపట్టినట్టు విశాఖ జిల్లా కన్వీనర్‌ మీనాకుమారి, సాగర్‌, డి. గోపాలకృష్ణ, బి. లక్ష్మీనారాయణ తెలిపారు.

కార్మిక మహాగర్జనను జయప్రదం చేయాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార : ఎంతో మంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే రెహ్మాన్‌ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు 666వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న కార్మిక మహాగర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ లాభాల్లో నడుస్తుందని.. ప్రభుత్వం సొంత గనులు కేటాయించకపోవడం వలన నష్టపోతుందని అన్నారు. గనులు కేటాయించి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్‌ చేశారు. రక్షణ రంగంలో కూడా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ విధానాలు నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ కాసుబాబు, నాగరాజు, సేప్పడు, శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

ఘంటసాల లఘు నాటిక ప్రదర్శన



ఘంటసాల లఘు నాటికలో డాక్టర్‌ రహ్మతుల్లా, నందగోపాల్‌, సత్యవాణి

డాబాగార్డెన్స్‌ : స్వాతంత్య్ర సమరయోధుడు, ప్రముఖ గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల శత జయంతి ఉత్సవాలు, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల లఘు నాటిక ప్రదర్శించారు. ఘంటసాల పాటలతో పదిమని, సోమయాజుల సత్యవాణి, కందర్పరాధ, పేరూరి వెంకట సోమశేఖర్‌, పాలంకిపాటి శ్రీనివాసరావు, శివప్రసాద్‌, జె. మురళీ, జనాబ్‌..హసీబ్‌ పాటలకు అనుగుణంగా హావాభావాలతో చక్కగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఘంటసాల గానావధాని, అవధాన శ్రేష్ట డాక్టర్‌ సయ్యద్‌ రహ్మతుల్లా ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు అలవోకగా సమాధానాలు చెప్పి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఘంటసాల జీవిత చరిత్రలో ముఖ్య ఘట్టాలు తీసుకుని లఘు నాటిక ప్రదర్శించారు. బడే గులాం ఆలీఖాన్‌గా డాక్టర్‌ రహ్మతుల్లా, ఘంటసాల పాత్రధారిగా నందగోపాల్‌, సావిత్రమ్మగా సోమయాజుల సత్యవాణి చక్కగా నటించారు. ఘంటసాల పాటలను బి. అరుణ్‌కుమార్‌, ఎంవీఆర్‌, కల్యాణి తదితరులు ఆలపించారు. ఈ సందర్భంగా ఆరాధన గ్రూప్‌ అడ్మిన్‌ డాక్టర్‌ రహ్మతుల్లా మాట్లాడుతూ ఘంటసాల కేవలం గాయకుడే కాదని, స్వాతంత్య్ర సమరయోధుడిగా తన సేవలు అందించారన్నారు. ఆయనను గుర్తు చేసుకుంటూ ఘంటసాలకు భారత రత్న ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సత్యదేవ్‌ సేవలు ఆదర్శనీయం



సత్యదేవ్‌ను సత్కరిస్తున్న ముఖ్య అతిథులు

అల్లిపురం: సమాజంలో వివిధ రంగాల ద్వారా గత నలభై అయిదు సంవత్సరాలకు పైగా నిస్వార్థంగా సేవలందిస్తున్న చింతలపాటి సత్యదేవ్‌ సేవలు ఆదర్శనీయమని సెంచూరియన్‌ యూనివర్సిటీ వైస్‌ చాన్సలర్‌ ఆచార్య జీఎస్‌ఎన్‌ రాజు కొనియాడారు. పబ్లిక్‌ రిలేషన్స్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా వైజాగ్‌ చాప్టర్‌ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ఒక హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో సత్యదేవ్‌కు బెస్ట్‌ పబ్లిక్‌ రిలేషన్స్‌ మేన్‌ అవార్డు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జీఎస్‌ఎన్‌ రాజు మాట్లాడుతూ సత్యదేవ్‌ ఆధ్యాత్మిక జీవనానికి, సామాజిక సేవకు అంకితమై జీవించడమనేది అరుదైన విషయమన్నారు. సమాజంలో సత్సంబంధాలు ఉంటే మహాత్కార్యాలు చేయవచ్చనడానికి సత్యదేవ్‌ ఉదాహరణ అన్నారు. ఏయూ జర్నలిజం ప్రొఫెసర్‌ వీఆర్‌ మూర్తి మాట్లాడుతూ స్వధర్మాచరణ, ఆధ్యాత్మిక దృక్పథం, సంఘ పరమైన సన్మార్గాన్ని చూపించిన మాస్టర్‌ ఈకే తనకు మార్గదర్శకులన్నారు. పబ్లిక్‌ రిలేషన్స్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా వైజాగ్‌ చాప్టర్‌ అధ్యక్షుడు పీఎల్‌ఎన్‌ మూర్తి మాట్లాడుతూ సమాజంలో విశిష్టమైన సేవలందిస్తున్న వారిని గుర్తించి ఇలాంటి అవార్డులు అందజేస్తుంటామన్నారు. సాహిత్యం, సాంస్కృతికం, ఆధ్యాత్మికం, సామాజిక రంగాల ద్వారా సత్యదేవ్‌ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

29న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



కంటి వైద్య శిబిరం కరపత్రం ఆవిష్కరిస్తున్న డాక్టర్‌ జహీర్‌ అహ్మద్‌ తదితరులు

డాబాగార్డెన్స్‌: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్‌ ఫౌండేషన్‌ సహకారంతో స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఏఎస్‌ బీచ్‌ హాస్పిటల్‌ ఎండీ డాక్టర్‌ జహీర్‌ అహ్మద్‌, పిల్లల స్పెషలిస్ట్‌ డాక్టర్‌ ముస్తఫా అహ్మద్‌, రౌండ్‌ టేబుల్‌ సంస్థ చైర్మన్‌ మక్సూద్‌ అహ్మద్‌ చేతుల మీదుగా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా క్యాంప్‌ కో ఆర్డినేటర్‌ ఎం. అరుణ్‌కుమార్‌ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో ప్రత్యేకంగా నిరుపేదలకు డాక్టర్‌ సలహా మేరకు కాటరాక్ట్‌ శస్త్ర చికిత్స, లెన్స్‌ అమరిక ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు, 39వ వార్డు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

వైద్యసేవలపై శిక్షణ కార్యక్రమం



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు



హాజరైన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

మహారాణిపేట : రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో మమత హెల్త్‌ ఇనిస్టిట్యూట్‌ ఫర్‌ మదర్‌ అండ్‌ చైల్డ్‌ ఆధ్వర్యంలో పీర్‌ ఎడ్యుకేటర్స్‌ శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్‌ పి.జగదీశ్వరరావు పాల్గొని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్‌కేఎస్‌కే మొబైల్‌ యాప్‌ వల్ల ఆరోగ్య రక్షణకు సంబంధించిన సమాచారం తెలుస్తుందన్నారు. ఈ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం ఎంఎంటీఏ సహకారంతో తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌కే రాష్ట్ర జాయింట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నిర్మలగౌరి, ఎంఏఎంటీఏ టీమ్‌ లీడర్‌ రవిసాలంకి తదితరులు పాల్గొని ఆర్‌కేఎస్‌కే గురించి వివరించారు. పైలెట్‌ ప్రాజెక్టుగా విశాఖపట్నం, కడప ప్రాంతాలను మాత్రమే ఎంపిక చేసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎస్‌వీ సమత, స్వప్న, శైలజ, కిరణ్‌ దేశవ్‌, హీనా దీక్షిత్‌, ఇ.శాంతిప్రియ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బేబీ చిప్స్‌తో ప్రమాదాలు



డాల్ఫిన్‌ జంక్షన్‌లో రోడ్డుపై తేలిన బేబీ చిప్స్‌



కాళ్లు, చేతులకు దెబ్బలతో వాహన చోదకుడు

అల్లిపురం: జీవీఎంసీ ఇటీవల డాల్ఫిన్‌ జంక్షన్‌లోని రోడ్లపై గోతులు పూడ్చింది. అయితే రోడ్డుపై బేబీ చిప్స్‌ తేలిపోవటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం డాల్ఫిన్‌ సర్కిల్‌ వద్ద రోడ్డుపై గల గోతులను పూడ్చడంతో బేబీ చిప్స్‌ పైకి తేలి ప్రమాదకరంగా మారాయి. ద్విచక్రవాహనాలు వాటిపై నుంచి ప్రయాణిస్తున్న సమయంలో స్కిడ్‌ అవటంతో జారి కిందపడుతున్నారు. అలా ఇప్పటి వరకు సుమారు పది మంది వాహనచోదకులు పడి తీవ్రగాయాల పాలై హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది రోడ్డుపై తేలిన బేబీ చిప్స్‌ను తక్షణమే తొలగించాలని స్థానికులతో పాటు వాహనచోదకులు కోరుతున్నారు.

తప్పిన ముప్పు

- పూర్ణామార్కెట్‌ పెరికివీధి రామాలయం వద్ద అకస్మాత్తుగా తెగిపడిన విద్యుత్‌ వైర్లు
- ఒక్కసారిగా కమ్ముకున్న చీకట్లు
- భయాందోళనలకు గురైన స్థానికులు



పెరికివీధిలోని ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద మరమ్మతు పనులు చేస్తున్న విద్యుత్‌ సిబ్బంది

జగదాంబ: పూర్ణామార్కెట్‌ వద్ద శుక్రవారం ఒక్కసారిగా విద్యుత్‌ వైర్లు తెగిపడి చీకట్లు కమ్ముకోవడంతో అంతా భయాందోళనకు గురయ్యారు. జీవీఎంసీ 35వ వార్డు పెరికివీధి రామాలయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రధాన హెచ్‌డీ లైన్‌ వైరు కూడా తెగిపోవడంతో ఈ ప్రాంతంలో ఒక్కసారిగా చీకట్లు కమ్ముకున్నాయి. దీంతో స్థానికులు కార్పొరేటర్‌ విల్లూరి భాస్కరరావుకు తెలియజేయడంతో వెంటనే విద్యుత్‌ శాఖ ఏఈకి ఫోన్‌ చేసి విషయం తెలిపారు. దాంతో ఆ శాఖ అధికారులు, ట్రాఫిక్‌ ఎస్సై భాస్కరరావు సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ నుండి సప్లై నిలిపివేసి పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు. తర్వాత మరమ్మతు పనులు చేపట్టారు. వన్‌ వే కావడం.. సాయంత్రం వేళ కనుక జన సంచారం లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి నష్టం జరగలేదని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

'మార్చి నాటికి కైలాసగిరి పార్కు సుందరీకరణ'

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం కైలాసగిరి పార్కును మార్చి నాటికి సుందరంగా తయారు చేస్తామని వీఎంఆర్‌డీఏ ప్రధాన ఇంజినీర్‌ శివప్రసాద్‌రాజు తెలిపారు. 'అధ్వానంగా కైలాసగిరి పరిసరాలు'అనే శీర్షికతో ఈ నెల 23న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. దీంతో ఈ ఏడాది మార్చిలో జరగనున్న జి.20 సదస్సుకు పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని ఓ ప్రకటనలో తెలిపారు. కొండపై రాతి శిల్పాల పార్కులో నడకదారులు బాగు చేయడం, పచ్చదనం కోసం మొక్కలు నాటడం వంటి పనులు చేపడతామన్నారు. ప్రస్తుతం శంఖు చక్ర నామాల నుంచి తెలుగు మ్యూజియం వరకు సర్వీస్‌ రోడ్డులో డెక్ట్‌ పనులు, నడక మార్గం పనులు జరుగుతున్నాయన్నారు.

ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం నాయకులు

డాబాగార్డెన్స్‌ : ఉత్తరాంధ్ర నుంచి ముస్లిం మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఉత్తరాంధ్ర ముస్లిం ఫోరమ్‌ కన్వీనర్‌ కేఎంసీ బాబూ బాయ్‌, అధ్యక్షుడు ప్రొఫెసర్‌ ఇక్బాల్‌, మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ డాక్టర్‌ ఖాజా, దేవరకొండ మార్కండేయలు అధికార, ప్రతిపక్షాలకు డిమాండ్‌ చేశారు. ఏలూరు నుంచి ఇచ్ఛాపురం వరకు 68 నియోజకవర్గాలున్నాయని, వాటిలో ఏ ఒక్క నియోజకవర్గమైనా ముస్లింలకు కేటాయించి, గెలుపునకు కృషి చేయాలన్నారు. వీజేఎఫ్‌ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కృష్ణా జిల్లా తర్వాత ఏలూరు నుంచి ఇచ్ఛాపురం వరకు 11 జిల్లాలున్నాయని, మొత్తంగా 8 లక్షల మంది ముస్లింలు ఉన్నారని, 68 నియోజకవర్గాలున్నాయని చెప్పారు. 68లో ఒక్క సీటైనా ముస్లింలకు కేటాయించాలని, అందుకు ఏ నియోజకవర్గమైతే బావుంటుందో చూసి సీటు కేటాయించాలని కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లక్ష పోస్టు కార్డుల ద్వారా ఉద్యమం చేపడతామని చెప్పారు. పోస్టుకార్డు ఉద్యమానికి ఉత్తరాంధ్రలో గల అన్ని ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్లు, ముస్లిం సేవా సంఘాలు, మత పెద్దలను కలుపుకుని విజయవంతం చేస్తామన్నారు.

యోగా, ధ్యానంతో మానసిక ఆరోగ్యం

ఏయూ క్యాంపస్‌: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం, ఆనంద్‌ మార్క్‌ ప్రచారక సంఘం సంయుక్తంగా రెండు రోజుల యోగా, ధ్యాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించాయి. ఏయూ ఎన్‌ఎస్‌ఎస్‌ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఏయూ ఆర్ట్స్‌ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్‌ ఆచార్య పి.రాజేంద్ర కర్మార్కర్‌ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా అతిథులు ప్రభాత్‌ రంజన్‌ సర్కార్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్ర కర్మార్కర్‌ మాట్లాడుతూ విద్యార్థి దశలో మానసికంగా ధృడంగా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి యోగా, ధ్యానం ఉపకరిస్తాయన్నారు. రినైసెన్స్‌ యూనివర్సల్‌(ఆర్‌యూ) కార్యదర్శి ఆచార్య వితమోహనానంద విద్యార్థులకు యోగా ప్రాధాన్యత, నిత్య జీవనంలో ఉపయోగాలను తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్‌ సమన్వయకర్త ఆచార్య ఎస్‌.హరనాథ్‌, ఆర్‌యూ ప్రతనిధి నారాయణ పాండా, స్టీల్‌ప్లాంట్‌ ఏజీఎం ఎ.వి.వి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎం వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం



ఎస్‌సీజెడ్‌ఐఈఎఫ్‌ జనరల్‌ సెక్రటరీ టీఎస్‌వీఎస్‌ రవీంద్రనాథ్‌

అల్లిపురం: ఎల్‌ఐసీ ప్రైవేటీకరణను భారత రాష్ట్ర సమితి పార్టీ వ్యతిరేకిస్తుందన్న తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు సౌత్‌ సెంట్రల్‌ జోన్‌ ఇన్సూరెన్స్‌ ఎంప్లాయిస్‌ ఫెడరేషన్‌ జనరల్‌ సెక్రటరీ టీవీఎస్‌ఎస్‌ రవీంద్రనాథ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఐసీ ఆఫ్‌ ఇండియాను ప్రైవేటీకరిస్తే ఎల్‌ఐసీ ఏజెన్సీ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అసంఖ్యాకమైన ఏజెంట్లకు కలిగే కష్టనష్టాలను కూడా ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఏకరువు పెట్టి వారికి అండగా నిలుస్తానని భరోసా ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఏఐఐఈఏ అఖిల భారత మహాసభల పిలుపుమేరకు రానున్న కాలంలో వివిధ జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో సదస్సులు నిర్వహించి ప్రభుత్వ రంగాల ఆవశ్యకతపై కార్మికులు, ప్రజలను చైతన్య పరుస్తూ కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు.